క్లుప్తంగా

చేతుల శుభ్రతతో రోగాలు దూరం

సీతానగరం: చేతులు పరిశుభ్రం చేసుకోవడంతో రోగాలు దూరంగా ఉండోచ్చని పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు విద్యార్థులకు వివరించారు. శనివారం చినకొండేపూడిలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ రాజు ఎంపీపీ స్కూల్‌ను సందర్శించి విద్యార్థులకు ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.

కాపవరం సర్పంచ్‌కు సత్కారం



సర్పంచ్ వెంకటరమణను సత్కరిస్తున్న సచివాలయ సిబ్బంది

బిక్కవోలు: పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా నీటి సంవృద్ధి కలిగిన ఉత్తమ పంచాయతీగా కాపవరం ఎంపికై నందుకు కాపవరం సచివాలయం వద్ద సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణను సచివాలయ సిబ్బంది, పంచాయతీవార్డు సభ్యులు, గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమణ మాట్లాడుతూ ఇది గ్రామస్తులు, అధికారుల సంయుక్త కృషి అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బిక్కవోలు: మండలంలోని కొమరిపాలెం, పందలపాక, ఊలపల్లి గ్రామాల పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో జేఏ ఝాన్సీ శనివారం తెలిపారు. మొత్తం పది పోస్టులకు ఖాళీలున్నాయన్నారు. వీటిలో కొమరిపాలెం గ్రామంలో ఏడు, పందలపాకలో రెండు, ఊలపల్లిలో ఒక పోస్టు ఉన్నాయన్నారు. పదోతరగతి ఉత్తీర్ణత పొందిన ఆసక్తి గల అభ్యర్థులు మే 1వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆ కాపీని సదరు పంచాయతీ కార్యదర్శికి అందజేయాలని ఎంపీడీవో సూచించారు.

పైపులైన్ పనుల పరిశీలన



ముగ్గళ్ల పంచాయతీ పైపులైన్ పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న

సీతానగరం: ముగ్గళ్ళ పంచాయతీలోని ఎస్సీపేటలో జరుగుతున్న తాగునీటి పైపులైన్ పనులను ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న పరిశీలించారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 30 ఏళ్ల క్రితం ఎస్సీపేటలో వేసిన పైపులైన్ పూడికుపోవడంతో తాగునీటి సమస్య ఏర్పడిందన్నారు. ప్రస్తుతం తాగునీటి సమస్యను తీర్చేందుకు పంచాయతీ, మండల పరిషత్ నిధులతో కొత్త పైపులైన్ వేస్తున్నట్టు తెలిపారు.

నేటి నుంచి సత్యసాయి బాలవికాస్ వారోత్సవాలు

రంగంపేట: ఈ నెల 30వ తేదీ నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో సత్యసాయి బాలవికాస్ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సేవా సంస్థల జిల్లా విద్యా విభాగ సమన్వయకర్తలు ఎల్.శ్రీనివాసరాజు, బి.మణిమాలలు తెలిపారు. శనివారం వారిద్దరూ మాట్లాడుతూ సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో స్థానిక సత్యసాయి సమాజ సేవా కేంద్రంలో 5 నుంచి 15 ఏళ్ల వయసున్న విద్యార్థులకు శిక్షణా తరగతులు జరుగుతాయన్నారు. వేదము, తండులార్చన, యోగా, ధ్యాన సాధన, చిత్రలేఖనం, నైతిక విలువలతో కూడిన కథలు, రామాయణ, భారత, భాగవత కథలపై క్విజ్ నిర్వహిస్తామని చెప్పారు.

తప్పిన ప్రమాదం



సీతానగరం తహసీల్దార్ కార్యాలయంపై ఈదురు గాలులకు విరిగిపడిన చెట్టు

సీతానగరం: అకాల వర్షం, ఈదురు గాలులకు సీతానగరం తహసీల్దార్ కార్యాలయంపై చెట్టు విరిగి పడింది. శనివారం మధ్యాహ్నం 4 గంటలకు ఒక్కసారిగా కారు మబ్బులు అలముకొని చిరు జల్లులు పడగా, వేగంగా ఈదురుగాలులు వీశాయి. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న చెట్టు ఒక్కసారిగి విరిగి కార్యాలయంపై పడింది. దీంతో పెద్ద శబ్దం రావడంతో సిబ్బంది బయటకు పరుగులు తీశారు. అయితే భవనానికి ఎటువంటి నష్టం కలగలేదు.

చెరువు మట్టితో చేనుకు పుష్టి

- రసాయన ఎరువుల్లో ఉండే పోషకాలు లభ్యం
- అధిక దిగుబడులకు ఆస్కారం



పొలాల్లో వేయడానికి అనువుగా ఉన్న చెరువు మట్టి

రంగంపేట: పంట భూముల్లో సేంద్రియ పదార్థం తక్కువగా ఉండటం, వర్షపునీటిని నిలుపుకునే సామర్థ్యం తగ్గుతుండటంతో రైతులకు సరైన దిగుబడులు రావడం లేదు. మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో విపరీతంగా రసాయన ఎరువులు వినియోగించడం వల్ల భూసారం తగ్గిపోతుంది. అందుకే రైతులు చెరువు మట్టిని విరివిగా వాడుకోవలసిన అవసరముంది. ప్రస్తుతం వేసవి కావడంతో చెరువుల్లో నీరు అడుగంటిపోతుంది. ఆయా చెరువుల్లోని మట్టిని పంట భూముల్లో వేసుకుంటే రసాయన ఎరువులపై పెట్టే ఖర్చును వీలైనంతగా తగ్గించుకోవచ్చునని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

సాగుకు అనుకూలం

గ్రామాల్లో వర్షాధార చెరువులు ప్రస్తుతం అడుగింటిపోతున్నాయి. ఎండిన చెరువుల్లోని 2 నుంచి 3 అడుగుల మేర పేరుకుపోయిన మట్టిని పంట భూముల్లో వేసుకోవాలి. దీనికి భూసార పరీక్షలు చేయించుకుని వాడుకుంటే ఇంకా మంచిది. జేసీబీలు, ట్రాక్టర్లతో తక్కువ ఖర్చుతో రైతులు మట్టిని తరలించుకునే అవకాశముంటుంది. తరువాత ఎంబీ నాగలితో పాటు రోటోవేటర్‌తో కలియదున్నితే భూమిలో అప్పటికే ఉన్న మట్టితో ఇది కలిసిపోయి పంట సాగుకు అనుకూలంగా మారుతుంది.

ఒండ్రు, బంకమట్టి ఎంతో మేలు

వర్షాలు బాగా కురిసినప్పుడు ఎత్తైన ప్రదేశాల నుంచి వర్షపు నీటితో పాటు ఇసుక, బంకమట్టి, ఒండ్రు మట్టి, వివిధ పాళ్లలో కుళ్లిన వ్యర్థ పదార్థాలతో కలిసి చెరువుల్లోకి చేరతాయి. అందులో నీరు ఉన్నంతకాలం లోపలే కుళ్లి మంచి సేంద్రియ కర్బనంగా మారుతుంది. సాధారణంగా చెరువు మట్టిలో 70 శాతం ఒండ్రు, 30 శాతం బంకమట్టి ఉంటుంది. పంటలకు అవసరమయ్యే నత్రజని, భాస్వరం, పొటాష్‌లతో పాటు సూక్ష్మ పోషకాలు కూడా ఉంటాయి. చెరువు మట్టి వల్ల పంట భూమిలో నీటి నిల్వ సామర్థ్యం, ఆయకట్టు విస్తీర్ణం పెరిగి అధిక దిగుబడులు సాధించొచ్చు. అంతేకాదు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించేందుకు ఆస్కారముంటుంది. విలువైన సేంద్రియ, కర్బన పదార్థం అందివ్వడం వల్ల మొక్కలు నీటి ఎద్దడిని సైతం తట్టుకుని దిగుబడులనిస్తాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

అధిక దిగుబడులకు అవకాశం



రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి. తమ పంట భూముల్లో సారాన్ని పెంచుకోవడానికి పెంటతో పాటు చెరువు మట్టిని వేసుకుని కలియదున్నితే ఎంతో మేలు జరుగుతుంది. పంటలకు అవసరమయ్యే పోషకాలు మెండుగా లభించి తద్వారా పంట ఏపుగా ఎదిగి అధిక దిగుబడులు సాధించడానికి అవకాశమేర్పడుతుంది.

– డీవీ కృష్ణ, ఏడీఏ, అనపర్తి

మదనగోపాలుని ప్రతిష్ఠాపన పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు

అనపర్తి: మండలంలోని పాలమూరులో పునర్నిర్మించిన రుక్మిణి, సత్యభామ సమేత మదనగోపాల స్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లు, వివిధ దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ పూజా కార్యక్రమాలు శనివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. తిరుమల తిరుపతి దేవస్థానం విద్వాంసులు, ప్రొఫెసర్ వేదాంతం విష్ణు భట్టాచార్యుల నిర్వహణలో, మిక్కిలి దుర్గయ్యశాస్త్రి పర్యవేక్షణలో 16 మంది వేదపండితులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాల్ని ప్రారంభించారు. సంకల్ప దీక్ష, విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, పంచగవ్యారాధన, కంకణధారణ, మృత్సంగ్రహణ, ఉక్త హోమాది క్రతువులు జరిపారు. సాయంత్రం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, కోలాట నృత్యాల, అశ్వరథ వాహనాలు, ఒంటెలతో స్వామి, అమ్మవార్ల నూతన విగ్రహాలను గ్రామం ఊరేగింపు నిర్వహించి శోభాయాత్ర జరిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి వెంకటరెడ్డి, జెడ్పీ మాజీ ప్రతిపక్ష నాయకుడు సత్తి రామారెడ్డి, సర్పంచ్ గుడాల ధనలక్ష్మి, ఉపసర్పంచ్ సత్తి సూరారెడ్డి, మాజీ సర్పంచ్ మేడపాటి గంగిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ తమలంపూడి వీరయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆప్‌కాస్ట్ మైనర్ ప్రాజెక్టుకు 'నన్నయ' అధ్యాపకురాలు



డాక్టర్ విజయనిర్మల

రాజానగరం: ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఆప్‌కాస్ట్) ద్వారా మైనర్ ప్రాజెక్టును నిర్వహించేందుకు ఆదికవి నన్నయ యూనివర్సిటీలో జువాలజీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ పి.విజయనిర్మలకు అవకాశం లభించింది. ఈ మేరకు ఆప్‌కాస్ట్ మెంబర్ సెక్రటరీ డాక్టర్ వై.అపర్ణ నుంచి తనకు ఉత్తర్వులు వచ్చాయని డాక్టర్ విజయనిర్మల తెలిపారు. ఈ ప్రాజెక్టులో భాగంగా గ్రీన్ సింథసిస్ ఆఫ్ కార్బన్ క్వాంటం డాట్స్ (సీక్యూడీఎస్), క్యారెక్టరైజేషన్, యాంటీ ఆక్సిడెంట్ కార్యకలాపాల మూల్యాంకనంపై అధ్యయనం చేయాల్సి ఉందన్నారు. ఈ అధ్యయనాన్ని త్వరలోనే పూర్తి చేసి, నివేదికను అందజేస్తానన్నారు.

గంజాయితో ఇద్దరి అరెస్టు

గోకవరం: రెండు కేజీల గంజాయితో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు గోకవరం ఎస్సై యువి శివనాగబాబు శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. రంపచోడవరం మండలం ఐ.పోలవరానికి చెందిన కారం ఈశ్వరదొర సహకారంతో గోకవరంలో స్థానిక బీఎస్‌ఆర్ కళాశాల ఎదురుగా కొత్తపల్లి వీరమణి అనే మహిళ గంజాయి విక్రయాలు సాగిస్తుండగా శనివారం సిబ్బందితో వెళ్లి దాడి చేసి పట్టుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈదురు గాలులకు విద్యుత్ అంతరాయం

రాజానగరం: మండలంలో శనివారం సాయంత్రం చిరుజల్లుతో వీచిన ఈదురుగాలులకు చెట్లు విరిగి పడి విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

విద్యార్థిని కృష్ణ తులసికి అభినందనలు



కృష్ణతులసికి జ్ఞాపికను అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి తదితరులు

అనపర్తి: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన మండలంలోని రామవరం గ్రామానికి చెందిన సత్తి కృష్ణ తులసిని అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, గ్రామ ప్రముఖులు ఘనంగా సత్కరించారు. శనివారం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సర్పంచ్ గిరడా గంగాభవాని అధ్యక్షతన జరిగిన అభినందన సభలో కృష్ణారెడ్డి మాట్లాడుతూ కృషి, పట్టుదలతో సాధించలేనిది ఏదీ లేదని, కృష్ణతులసి ఇంటర్ ఫలితాల్లో 991 మార్కులు సాధించడమే దీనికి నిదర్శనమన్నారు. అనంతరం విద్యార్థిని కృష్ణ తులసి, ఆమె తల్లి మేరీ పావనిలను గ్రామానికి చెందిన పలువురు ప్రముఖులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు నల్లమిల్లి భాగ్యలక్ష్మి, గొలుగూరి గౌతమి, పాఠశాల హెచ్‌ఎం ప్రసాద్, పార్టీ మండల అధికార ప్రతినిధి నల్లమిల్లి వెంకటరెడ్డి, పార్టీ నాయకులు నల్లమిల్లి రాజు, గిరడా రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులు, లారీ ఓనర్ల మధ్య వివాదం



నాగరత్నం కాలనీ వద్ద రైతులు, లారీ అసోసియేషన్ ప్రతినిధుల మధ్య జరుగుతున్న చర్చలు

సీతానగరం: సింగవరం పంచాయతీ పరిధిలోని నాగరత్నం కాలనీ వద్ద రైతులకు, లారీ ఓనర్స్‌కు మధ్య వివాదం జరిగింది. నాగరత్నం కాలనీ వద్ద నుంచి ధాన్యం బస్తాలు ఉన్న ప్రాంతానికి వెళ్లడానికి క్వింటా ధాన్యానికి కిలోమీటరుకు రూ.50 చొప్పున ఎనిమిది కిలోమీటర్ల వరకు ప్రభుత్వం సొమ్ము చెల్లిస్తుంది. అయితే లారీ అసోసియేషన్ వారు రూ.100 చెల్లించాలని డిమాండ్ చేశారు. దీంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా ధాన్యం తీసుకెళ్లేందుకు లారీలు ఖాళీగా రైతుల వద్దకు రావాల్సి ఉండడంతో మరో రూ.1000 అదనంగా అడిగారు. దీనిపై రైతుల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇరువురి మధ్య చర్చలు జరిగాయి. యథావిధిగా కిలో మీటరుకు రూ.50 చెల్లింపునకు ఒప్పుకుంటూనే, ఖాళీ లారీ రావాలసి ఉన్నందున రైతులు నుంచి రూ.500 తీసుకోవడానికి లారీ అసోసియేషన్ వారు ఒప్పుకోవడంతో సమస్య పరిష్కారైంది.

డ్రైన్ నిర్మాణాలపై సమగ్ర విచారణ

- మృతుడు నాగేశ్వరరావు కుటుంబ సభ్యులకు ఎంపీ భరత్ పరామర్శ
- షిరిడీసాయి మార్గ్‌లో డ్రైనేజీ పనుల పరిశీలన



మృతుడు నాగేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: జేఎన్ రోడ్డు షిరిడిసాయి మార్గ్‌లో డ్రైన్ నిర్మాణాలపై సమగ్ర విచారణ చేయిస్తామని ఎంపీ మార్గాని భరత్‌రామ్ పేర్కొన్నారు. ఇటీవల షిరిడీ సాయి మార్గ్ జంక్షన్ వద్ద నిర్మాణంలో ఉన్న డ్రైనేజీలో దురదృష్టవశాత్తు పడి మృతి చెందిన ఏరుకొండ నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను శనివారం ఆయన పరామర్శించి, నాగేశ్వరరావు చిత్రపటానికి నివాళులు అర్పించారు. ప్రభుత్వ పరంగా రావాల్సిన నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తానని నాగేశ్వరరావు భార్యా పిల్లలకు భరత్‌రామ్ హామీ ఇచ్చారు. అనంతరం షిరిడీ సాయి మార్గ్‌లో నిర్మాణ దశలో ఉన్న డ్రైనేజీ పనులను అధికారులతో కలసి పరిశీలించారు. ముందు రోజు అర్ధరాత్రి నుంచి వర్షం పడడం డ్రైన్లలో వర్షపు నీటితో పాటు మురుగునీరు పేరుకుపోవడంతో ఆ నీటిని మోటార్ల సహాయంతో బయటకు తోడే పనిని ఇంజినీరింగ్ సిబ్బంది చేపట్టారన్నారు. రాత్రి సమయంలో నాగేశ్వరరావు అటుగా వస్తూ పొరపాటున కాలు స్లిప్ అయి డ్రైయినేజీలో పడి మృతిచెందారన్నారు. ఈ పనులు జరుగుతున్న విషయం ఈ ప్రాంత వాసులకు తెలుసునన్నారు. అప్పటికీ అటూ ఇటూ జేసీబీ తదితర రక్షణ ఏర్పాట్లు చేశారన్నారు. ఏదేమైనా సంఘటన చాలా దురదృష్టకరమన్నారు. ఈ ప్రాంతంలో 15ఏళ్ల క్రితమే నగర పాలక సంస్థ డ్రైనేజీలు నిర్మించిందని, ఎందుకూ ఉపయోగపడని విధంగా పనులు చేయడంతో ఈ పరిస్థితులు తలెత్తాయన్నారు. మరి ఆ సమయంలో మేయర్, కార్పొరేటర్లు, నగర పాలక సంస్థ అధికారులు ఏ విధంగా ఈ అస్తవ్యస్త డ్రైయినేజీలు నిర్మించారో దీని వెనుక ఎవరెవరు బాధ్యులో సమగ్ర విచారణలో వెల్లడవుతాయన్నారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారన్నారు. నగరంలో జరిగే అభివృద్ధి పనుల విషయంలో తనని వేలెత్తి చూపడమే కానీ ఎమ్మెల్యే ఇంటి సమీపంలో జరిగే పనుల విషయంలో పర్యవేక్షించే బాధ్యత ఆమెకు లేదా అని ఎంపీ భరత్ రామ్ ప్రశ్నించారు. అర్బన్ ఎమ్మెల్యే అధికారులను పిలిచి అడుగుతుంటారు కదా అటువంటిది కనీసం ఎమ్మెల్యే ఇంటి సమీపంలో జరిగే అభివృద్ధి పనుల విషయంలో ఎందుకు శ్రద్ధ వహించలేకపోయారన్నారు. ప్రజల సమస్యలు పట్టించుకుంటారని మీకు ఓటేసి గెలిపిస్తే మీరు చేసేదేమీ లేదన్నారు. చేసే వారిపై ఆరోపణలు, విమర్శలు చేయడం తప్పిస్తే మరొకటి లేదని భరతరామ్ ధ్వజమెత్తారు.

తుది దశకు పుష్కర్ ప్లాజా పనులు



పుష్కర్‌ప్లాజా పనులు పరిశీలిస్తున్న కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో జరుగుతున్న పుష్కర్ ప్లాజా పనుల్లో పూర్తి నాణ్యత ప్రమాణాలు పాటించాలని కమిషనర్ దినేష్‌కుమార్ ఇంజినీరింగ్ అధికారులకు, కాంట్రాక్టరుకు సూచించారు. శనివారం నగరపాలక సంస్థ పరిధిలో కొత్తగా రూపుదిద్దుకుంటున్న పుష్కర్ ప్లాజాను సందర్శించి, పనులను పరిశీలించారు. కమిషనర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ నగరంలో ప్రధాన ప్రాంతంగా ఉన్న పుష్కర్ ఘాట్ రైల్వే అండర్ బ్రిడ్జి పక్కన ఉన్న ఈ స్థలం నిరుపయోగంగా, జనావాసాలు లేని ప్రాంతంగా ఉండడంతో ఇలాంటి ప్రదేశాన్ని పుష్కర్ ఘాట్ వద్దకు వచ్చే పర్యాటకులకు కూర్చొనేలా తీర్చిదిద్దామన్నారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే పనులన్నీ దాదాపు తుది దశకు చేరాయని, నగర ప్రజలకు పర్యాటకులకు ఆహ్లాదకరంగా పుష్కర్ ప్లాజాను ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండు రంగారావు, సంబంధిత ఇంజినీర్లు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో సీట్ల భర్తీకి 15 వరకూ గడువు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రానున్న విద్యా సంవత్సరంలో ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను రెండో విడతగా కేటాయింపు వచ్చే నెల 15వ తేదీ వరకూ ఉందని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం శనివారం తెలిపారు. 2023–24లో విద్యా హక్కు చట్టం ప్రకారం రాష్ట్రంలోని వెనుకబడిన వర్గాలు, అనాథ, హెచ్‌ఐవీ బాధిత, వికలాంగులు, బలహీన వర్గాలు, షెడ్యూలు కులం, షెడ్యూల్ తెగ వర్గాలకు చెందిన పిల్లలు అర్హులన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 16 నుంచి 20వరకూ దరఖాస్తులను పరిశీలించి, అర్హత నిర్ధారిస్తారన్నారు. 22న లాటరీ పద్ధతి, 24వ తేదీ నుంచి 28 వరకూ అడ్మిషన్ల నిర్ణయిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు ఏపీ.సీఎస్ఈ.గవ్.ఇన్ వెబ్‌సైట్‌లో చూడవచ్చన్నారు.

స్పందనకు తప్పనిసరిగా హాజరవ్వాలి

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి మండల స్థాయి అధికారులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని తహసీల్దార్ అమ్మాజీ సూచించారు. శనివారం ఆమె మాట్లాడుతూ ప్రతి సోమవారం ఉదయం 10 గంటలకు స్పందనకు హాజరు శాతాన్ని రాజమహేంద్రవరం కలెక్టర్ కార్యాలయానికి పంపిస్తామని చెప్పారు. స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అమ్మాజీ కోరారు.

బిక్కవోలు: మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి మండల స్థాయి అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని ఎంపీడీవో జేఏ ఝాన్సీ శనివారం తెలిపారు.

అనపర్తి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మండల స్థాయి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని, ఈ కార్యక్రమానికి మండల అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని ఇన్‌చార్జి తహసీల్దార్ కె.శశిధర్ తెలిపారు.

రేపు స్పందన కార్యక్రమం

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ రాజు తెలిపారు.

రేపు మండల పరిషత్‌లో 'స్పందన'

రాజానగరం: ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా ప్రతి సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ బి.రామారావు విజ్ఞప్తి చేశారు. ఇప్పటి వరకూ తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న ఈ కార్యక్రమం వచ్చే సోమవారం నుంచి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరుగుతుందన్నారు. ఈ మార్పును మండల ప్రజానీకం గమనించాలన్నారు.

జగనన్న పాలనకు ప్రజల బ్రహ్మారథం

ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సబ్బెళ్ల కృష్ణారెడ్డి

అనపర్తి: సీఎం జగనన్న పారదర్శక పాలనకు ప్రజలు బ్రహ్మారథం పడుతున్నారని అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 7 నుంచి 29 వరకూ నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు పీపుల్ సర్వేలో 1.45 కోట్ల కుటుంబాలను పార్టీ శ్రేణులు కలిసి సర్వే చేయగా జగనన్నకు మద్దతుగా 1.10 కోట్ల మిస్డ్ కాల్స్ వచ్చాయన్నారు. దీని ద్వారా రాష్ట్ర ప్రజలు 'జగనన్నే మా భవిష్యత్తు' అని స్పష్టం చేశారన్నారు. నియోజకవర్గంలోని 72 సచివాలయాల పరిధిలో జగనన్నే మా భవిష్యత్తు పేరుతో 90 వేల కుటుంబాలను పార్టీ శ్రేణులు సర్వే చేయగా 80 వేల మిస్డ్ కాల్స్ వచ్చాయన్నారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేగా డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిలు తిరిగి విజయం సాధించాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు.

సమావేశంలో ఎంపీపీ కేతా తులసి శ్రీనివాస్, పెదపూడి మండల జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, పార్టీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి చిర్ల వీర్రాఘవరెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి పోతుల ప్రసాదరెడ్డి, షణ్ముఖి చిట్టిరాజు, కన్వీనర్ గుత్తుల రమణ తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుంకర శ్రీవల్లి

గోకవరం: రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ సుంకర శ్రీవల్లి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ధాన్యం గిట్టుబాటు ధరలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మండలస్థాయి అధికారులు, రైతులతో ఆమె సమావేశం నిర్వహించారు. మండలంలో సుమారు 550 ఎకరాల్లో రైతులు 1156 రకం ధాన్యం సాగు చేశారన్నారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోవడంతో క్వింటాల్‌కు 6 కేజీల నుంచి 20 కేజీల వరకూ ధాన్యం రేటు తగ్గిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తహసీల్దార్ శ్రీనివాస్ స్పందిస్తూ రైతులకు మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక అధికారిగా విజయ్ కుమార్‌ను నియమించామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దాసిరి శ్రీరంగ, ఎంపీడీఓ మూర్తి, ఏఓ రాజేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, తోలేటి ప్రసాద్, నరాల శెట్టి సరసయ్య, టౌన్ కన్వీనర్ చింతల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



సంగీత దర్శకుడు కోటిని సత్కరిస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సినీ సంగీత దర్శకులు సాలూరి కోటేశ్వరరావు(కోటి) సమక్షంలో కోటి స్వర మహోత్సవం పేరిట సినీ సంగీత విభావరి శనివారం రాత్రి శ్రీవేంకటేశ్వర ఆనం కేద్రంలో వీనుల విందుగా సాగింది. శ్రీహరి ఈవెంట్స్ పిరాట్ల హరి నిర్వహణలో, ఉమాదేవి, సింగర్ ప్రియ పర్యవేక్షణలో సాగిన సంగీత విభావరి ఆద్యంతం అలరించింది. రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్ రామ్, మ్యూజిక్ డైరెక్టర్ కోటి, రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిల రెడ్డి, జ్యోతి ప్రజ్వలన చేశారు. రాజమహేంద్రవరంలోని వివిధ సంగీత సంస్థలు గాయనీ గాయకులు, డా.బిక్కిన రామమనోహర్, డాక్టర్ వట్టి గంగా కిషోర్, రాజేశ్వరరావు, వడిశ లేరు బేబీ, భవ్య, డాక్టర్ శ్రీనివాస్ తదితరులు గీతాలాపన చేశారు. కోటిని ఎంపీ భరత్ సత్కరించారు. అలాగే తేజంజలిని కోటి సత్కరించారు. ఎంపీభరత్‌రామ్‌ను గాయనిగాయక బృందం, కోటి ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు నల్లమిల్లి సూర్యకాంతం, దాదాపు 60 మంది గాయనీ గాయకులు 'కోటి' స్వర మహోత్సవంలో పాల్గొన్నారు.

వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలి

కంబాలచెరువు: విద్యార్థులు వేసవి సెలవులు సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు తగు చర్యలు తీసుకోవాలని అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సెలవుల్లో ప్రభుత్వం నిర్దేశించిన ఉయ్ లవ్ రీడింగ్ (చదువంటే మాకిష్టం) కార్యక్రమంలో పాఠశాల లైబ్రరీ నుంచి ఇచ్చే కథలు, వ్యాసాలు చదవాలన్నారు. ప్రతి రోజు దినపత్రిక కూడా చదవాలన్నారు. పాఠశాల పేరెంట్ కమిటీ చైర్మన్లు ఎం.దుర్గాప్రసాద్, కేడీఎం రత్నం, ఉపాధ్యాయులు వరహాగిరి కృష్ణ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో వర్షం

రాజమహేంద్రవరం సిటీ: అకస్మాత్తుగా మారిన వాతావరణంతో రాజమహేంద్రవరం నగర ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఈదురుగాలులకు నగరంలో విద్యుత్ స్తంభాలు, తీగలు నేలకొరిగాయి. ఈదురు గాలులకు నగరంలో సుమారు రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. వేసవి ఉష్ణోగ్రతలతో అల్లాడిపోతున్న ప్రజలకు అకస్మాత్తుగా మారిన వాతావరణంతో ఉపశమనం కల్పించింది. రూరల్ ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయా లేదా సిబ్బంది పరిశీలన చేస్తున్నారన్నారు.

కడియం: మండలంలో శనివారం మధ్యాహ్నం ఈదురుగాలులతో వర్షం కురిసింది. వర్షానికి కళ్లాల్లో ఉన్న ధన్యాం తడిసిపోయాయి. పొలంలో పనుల చేసి తిరిగి ఇళ్లకు వెళ్లిన రైతులు, కూలీలు పరుగుపరుగున కళ్లాలకు వెళ్లి ధాన్యం తడిసిపోకుండా కాపాడుకునేందుకు నానా తంటాలు పడ్డారు. ధాన్యానికి రక్షణ ఏర్పాట్లు చేశారు.

వాస్తవిక కథనంతో 'ఉగ్రం' చిత్రం



సమావేశంలో మాట్లాడుతున్న హీరో అల్లరి నరేష్, చిత్రంలో హీరోయిన్ మిర్నామీనన్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): వాస్తవిక కథనంతో ఉగ్రం చిత్రాన్ని తెరకెక్కించినట్టు సినీ హీరో అల్లరి నరేష్ తెలిపారు. మే 5వ తేదీన ఈచిత్రం థియేటర్లలో విడుదలవుతున్న సందర్భంగా ప్రమోషన్స్‌లో భాగంగా శనివారం స్థానిక షల్టన్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాంది చిత్రం తర్వాత సీరియస్ పాత్రలు వస్తున్నాయన్నారు. 20 ఏళ్లుగా చేస్తున్న కామెడీ పాత్రలపై మొహం మొత్తేసి కొత్తగా సీరియస్ పాత్రను చేస్తున్నానన్నారు. గతంలో కామెడీ చిత్రాలను ఎలా ఆదరించారో ఇప్పుడు కూడా అదే విధంగా ఆదారణ చూపించాలని కోరారు. కోవిడ్ సమయంలో లక్షా 60 వేల మంది కనిపించకుండా పోయారని, వారిలో సగం మంది వివరాలు మాత్రమే తెలిశాయని, మిగిలినవారు ఏమయ్యారన్న కథాంశంతో ఉగ్రం తెరకెక్కిందన్నారు. ఈ సినిమాలో సీరియస్ పోలీస్‌గా కనిపిస్తానని, మైత్రీ ఫిలింస్ విడుదల చేస్తున్న 7వ చిత్రం ఉగ్రం మంచి హిట్ అందుకుంటుందన్నారు. ఉగ్రంతో 60 సినిమాలు పూర్తయ్యాయని తెలిపారు. హీరోయిన్ మిర్నామీనన్ మాట్లాడుతూ ఇది తన రెండో చిత్రమని, 5న విడుదల అవుతున్న ఈ చిత్రాన్ని థియేటర్‌లో చూసి తమ చిత్ర బృందాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఈ చిత్రంలో నరేష్ చాలా బాగా నటించారన్నారు. విలేకరుల సమావేశంలో గోల్కొండ హైస్కూల్ ఫేం సాయి శ్రీనివాస్, మైత్రి ఫిలింస్ ఉదయ్ మాట్లాడారు.